క్లుప్తంగా

ఘనంగా వసంత పంచమి



పూజలందుకుంటున్న జ్ఞాన సరస్వతి

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జిన్నాయిగూడ చత్రగిరి లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం జ్ఞాన సరస్వతికి అర్చకులు ఆరాధన, అభిషేకము, విశేష పుష్పార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు అజయ్‌శర్మ, మురళీశర్మ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల సత్తా



విద్యార్థులతో ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి

కందుకూరు: మహేశ్వరం సాంఘీక సంక్షేమ మహిళ గురుకుల కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సత్తా చాటారు. మంగళవారం వెలువడిన జేఈఈ మెయిన్స్-1 ఫలితాల్లో గురుకులానికి చెందిన మొత్తం 28 మంది విద్యార్థినీలు పరీక్ష రాయగా అందులో ఏడుగురు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి తెలిపారు. అర్చన, నిహారిక, శ్రావణి, సోనియా, అక్షిత, సింధు, శశిత అడ్వాన్స్ పరీక్షతో పాటు ఎన్ఐటీ కోర్సు చదవడానికి అర్హత సాధించారు. బుధవారం విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

మహేశ్వరం తహసీల్దార్‌గా విజయలక్ష్మి



మహేశ్వరం: మహేశ్వరం మండల నూతన తహసీల్దార్‌గా విజయలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న కొత్త పట్టా పాసు పుస్తకాలు, మ్యూటేషన్ సక్సేషన్‌తో పాటు ఇతర భూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. రెవెన్యూ రికార్డుల సవరణ, విద్యార్థులకు కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలను సకాలంలో అందిస్తామని పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్‌ఎంఆర్‌ఎల్)లో భూ సేకరణ తహసీల్దార్‌గా హైదరాబాద్ కలెక్టరేట్ కార్యాలయంలో విజయలక్ష్మి పనిచేశారు. మహేశ్వరంలో తహసీల్దార్‌గా పనిచేసిన మహమూద్ అలీ (హెచ్‌ఎంఆర్‌ఎల్) హైదరాబాద్ మెట్రోరైల్ లిమిటెడ్ రెవెన్యూ విభాగానికి బదిలీ అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల భాగంలోనే తహసీల్దార్లను బదిలీ చేశారు.

దిగ్విజయ్‌సింగ్‌ను కలిసిన జానకీరామ్



దిగ్విజయ్‌సింగ్‌ను సన్మానిస్తున్న జానకీరామ్

తుక్కుగూడ: మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ జాతీయ సీనియర్ నాయకుడు దిగ్విజయ్‌సింగ్ తెలంగాణ రాష్ట్ర రాజ్యసభ సభ్యుల ఎంపిక సందర్భంగా హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను బుధవారం పీసీసీ కార్యదర్శి జానకీరామ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సన్మానించారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 15, వంకాయ 13, బెండ 45, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 45, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 23, క్యారెట్ 19. దొండ 43, ఆలు 21, ఉల్లి 19, గోకర 40, దోస 19, సొర 09, పొట్ల 13, అరటి 09, చిక్కుడు 45, అర్వి 55, మునగ 55, చిలగడదుంప 58, బీట్‌రూట్ 18, కీర 25, ఫ్రెంచ్ బీన్స్ 45, కాప్సికమ్ 60. ఈ ధరలు గురువారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

బ్రహ్మోత్సవాలకు వేళాయె



చెన్నకేశవస్వామి ఆలయం, ఇన్‌సెట్‌లో రథం

- నేటి నుంచి చుక్కాపూర్ చెన్నకేశవస్వామి ఆలయ వేడుకలు
- కోరిన కోర్కెలు నెరవేర్చే స్వామిగా ప్రసిద్ధి
- రాష్ట్ర నలుమూలల నుంచి తరలిరానున్న భక్తులు

తలకొండపల్లి: తలకొండపల్లి మండలం చుక్కాపూర్‌లోని శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఇక్కడ కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. ఈ ఆలయంలో నిద్ర చేసినచో దుష్ట శక్తులను పారద్రోలి, మానసిక ప్రశాంతత కలుగడంతో పాటు అనారోగ్య సమస్యలు, ఆర్థిక నష్టాల నుంచి బయట పడతారని భక్తుల విశ్వాసం. ఇంత ప్రసిద్ధి చెందిన ఈ ఆలయ బ్రహ్మోత్సవాలు రేపటినుంచి ప్రారంభమవుతున్నాయి. ప్రతి యేటా ఈ ఉత్సవాలకు రాష్ట్రం నలువైపుల నుంచి భక్తులు తరలివస్తారని నిర్వాహకులు తెలిపారు. కోర్కెలు తీరిన వారు సత్యనారాయణ వ్రతాలు, తలనీలాలు, పుట్టు వెంట్రుకలు తదితర ముడుపులు సమర్పించి మొక్కు తీర్చుకుంటున్నారు.

హైదరాబాద్‌కు అతి చేరువలో..

హైదరాబాద్ నగరానికి 70 కి.మీ దూరంలో ఆమనగల్లు-శ్రీశైలం ప్రధాన రహదారిలో ఆమనగల్లు నుంచి తలకొండపల్లి వెళ్లే దారిలో చుక్కాపూర్‌కు 9 కి.మీ దూరంలో ఈ చెన్నకేశవస్వామి ఆలయం ఉంది. ఈ గుడి మొదట చిన్నదిగా ఉండేది. దాతల సహాయంతో ఆలయం అంచెలంచెలుగా అభివృద్ధి చెందింది. ఆలయ ప్రాంగణంలో నవగ్రహాలు, కోనేరు, రథశాల, వంటశాల తదితర భవన సముదాయాలను నిర్మించారు.

నేటి నుంచి ఉత్సవాలు...

ఈ ఆలయ బ్రహ్మోత్సవాలను ప్రతి యేట సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి మొక్కురాల వెంకటేశ్వరశర్మ తెలిపారు. 15న ప్రారంభమై 19న బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని చెప్పారు.



ఏర్పాట్లు పూర్తి



ప్రతి ఏటా రథసప్తమిని పురస్కరించుకొని సాంప్రదాయ బద్ధంగా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నాం. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. ఆలయం ఆవరణలో తాగునీరు, చలువ పందిర్లు వంటి ఏర్పాట్లు చేస్తున్నాం.

– వెంకటేశ్వరశర్మ, పూజారి

అభివృద్ధి చేయాలి



బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర నలుమూలలు నుంచి భక్తులు తరలి వస్తుంటారు. కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. ఈ విషయాన్ని అధికారులతో పాటు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాను.

– యాదయ్య, మాజీ ఎంపీటీసీ, చుక్కాపూర్

కోర్కెలు నెరవేరుతాయి



ఇక్కడ స్వామివారిని దర్శించుకున్న భక్తుల కోరిన కోర్కెలు నెరవేరుతాయి. మహిమలు గల దైవం శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయ ప్రత్యేకత. ప్రతి యేడాది భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు.

– కిష్టమ్మ, మాజీ సర్పంచ్, చుక్కాపూర్

చేవెళ్ల లోక్‌సభ స్థానం మాదే



లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

- గెలిచి సోనియాగాంధీకి కానుకగా ఇస్తాం
- మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం: త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకొని ఏఐసీసీ నేత సోనియాగాంధీకి కానుకగా ఇస్తామని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, మహేశ్వరం మాజీ సర్పంచ్ యాదయ్య, మాజీ ఉప సర్పంచ్‌లు దోమ శ్రీనివాస్ రెడ్డి, రాములుతో పాలు పలువురు బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీకి దిక్కులేదని, బీఆర్‌ఎస్‌కు అధికారం లేదు కాబట్టి కాంగ్రెస్ పార్టీలోకి రావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు నేతలు, ప్రజా ప్రతినిధులు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని కోరారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ ఖాళీ కావడం ఖాయమని ఎద్దేవాచేశారు. ప్రతి నాయకుడు, కార్యకర్తకు అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, పార్టీ సీనియర్ నాయకుడు రఘుమారెడ్డి, మాజీ పార్టీ మండల అధ్యక్షుడు దశరథ, ఈశ్వర్ ముదిరాజ్, నాయకులు సాంబయ్య, లాజర్, జంగయ్య ముదిరాజ్, కుమార్, కృష్ణనాయక్, పాండునాయక్, నారాయణ, నర్సింహాగౌడ్, శ్రీకాంత్, రాజు నాయక్ పలువురు పాల్గొన్నారు.

ఆ కమిషనర్లు మనవారే

పహాడీషరీఫ్: లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మున్సిపాలిటీ కమిషనర్ల బదిలీల ప్రక్రియలో రెండు మున్సిపాలిటీలకు జల్‌పల్లి మున్సిపాలిటీకి చెందిన అధికారులే కమిషనర్లుగా నియమితులయ్యారు. జల్‌పల్లి కమిషనర్ ఎస్.వసంత ఆమనగల్లు మున్సిపాలిటీకి బదిలీ కాగా, మరొకరు మేనేజర్‌గా పనిచేస్తున్న సుదర్శన్ వనపర్తి మున్సిపాలిటీకి బదిలీపై వెళుతున్నారు. జల్‌పల్లి కమిషనర్‌గా వసంత 2022 అక్టోబర్ 12న బాధ్యతలు చేపట్టి 16 నెలలు పాటు సమర్థవంతంగా విధులు నిర్వహించారు. సుదర్శన్ 2019లో పది రోజుల పాటు, 2022లో మూడు నెలల పాటు కమిషనర్‌గా, ఐదేళ్ల పాటు మేనేజర్‌గా ఇక్కడ పని చేశారు. కాగా జల్‌పల్లి మున్సిపాలిటీకి నూతన కమిషనర్‌గా నల్గొండ మున్సిపాలిటీలో అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న సయ్యద్ ముసాబ్ అహ్మద్ బాధ్యతలు చేపట్టబోతున్నారు.

సమ్మెను విజయవంతం చేయండి



ర్యాలీలో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు

తుక్కుగూడ: ఈ నెల 16న దేశవ్యాప్తంగా కార్మికులు నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూ జిల్లా ఉపాధ్యాక్షుడు దత్తు నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం సమ్మెను విజయవంతం చేయాలని మంఖాల్ పారిశ్రామిక వాడలో కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. సంఘం నాయకులు యాదగిరి, బ్రహ్మాచారి, భారతి, కల్పన, నర్సింహ, వెంకటేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కండి

ఎంపీపీ కమ్లీమోత్యానాయక్

కడ్తాల్: గ్రామాల అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వామ్యులు కావాలని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని మైసిగండి గ్రామ పంచాయతీలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎంపీపీ పర్యటించారు. మండల పరిషత్ నిధులు రూ.8 లక్షలతో నిర్మించనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆమె భూమి పూజ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన సాగుతుందని.. తండాలు, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక కృషి చేస్తున్నామని తెలిపారు. మండలాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యదర్శి సత్యం, మాజీ వార్డు సభ్యులు జవహర్‌లాల్, శ్రీను, రాములు, యాదగిరి ఉన్నారు.



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కమ్లీమోత్యానాయక్

ఎమ్మెల్యే కసిరెడ్డికి సత్కారం



ఎమ్మెల్యే కసిరెడ్డిని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

ఆమనగల్లు: కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆమనగల్లులోని కేడీఆర్ కళాశాల మొదటి బ్యాచ్ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఆమనగల్లు పట్టణంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కేడీఆర్ కళాశాలను 1989లో స్థాపించగా అందులో చదివిన ఇంటర్ మొదటి బ్యాచ్ విద్యార్థులు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో బుధవారం ఎమ్మెల్యేను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లింగంగౌడ్, వేణుగోపాల్‌రెడ్డి, మహ్మద్ మూసా, లక్ష్మణ్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, శంకర్, హరికిషన్‌రెడ్డి, ఆనంద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

దివ్యాంగుల జంటకు ఉచిత వివాహం

మలక్‌పేట: నిరుపేదలను చేరదీసి వారికి చేయూతను అందిస్తూ జిగిని ఫర్నిచర్ నిర్వాహకులు ఆదర్శంగా నిలుస్తున్నారని మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్ అన్నారు. బుధవారం మలక్‌పేటలోని ఫిష్ బధిరుల పాఠశాల ఆవరణలో దివ్యాంగులైన మహాలక్ష్మి, శివకుమార్ జంటకు జిగిని ఫర్నిచర్ నిర్వాహకులు జిగిని శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో ఆదర్శ వివాహం జరిపించారు. అనంతరం శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ, నిరుపేదలకు తనవంతు సహకారాన్ని అందించే లక్ష్యంతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. హిందూ సాంప్రదాయం ప్రకారం వేద బ్రాహ్మణులలో పుస్తె మెట్టలను, పట్టు వస్త్రాలను ఉచితంగా అందించి దివ్యాంగుల జంటకు అంగరంగ వైభవంగా వివాహం జరిపించామన్నారు. కార్యక్రమంలో ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి, ఎడవెల్లి బాలరాజుగుప్తా, పెద్ది శ్రీనివాస్ గుప్తా, జగిని విజయ్ గుప్తా, పూర రమేష్‌గుప్తా, నాంపల్లి శ్రీనివాస్ గుప్తా, పద్మ నారాయణ గుప్తా పాల్గొన్నారు.



నూతన వధూవరులను అభినందిస్తున్న జగిని ఫర్నిచర్ నిర్వాహకుడు శ్రీనివాస్‌గుప్తా

భవానీ రామలింగేశ్వర ఆలయానికి భూమి పూజ

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కే పురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ ఫేజ్ -1 లో శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆలయానికి బుధవారం భూమి పూజ చేశారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుబ్బాక శేఖర్, పొన్నాల తిరుమల్, కోస్గి శంకర్, కనకరాజ్, నర్షి రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

కమలానగర్ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని వనస్థలిపురం కమలానగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టీవీ రావు, ఉపాధ్యక్షుడిగా ఎం.గణేష్, బి.మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శిగా తుమ్మల సుబ్బారావు, సంయుక్త కార్యదర్శులుగా బి.జ్యోతిరెడ్డి, కె.వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా సి.దివాకర్, పుష్పాంజలి, కోశాధికారిగా భరత్ సింగ్, కార్యవర్గ సభ్యులుగా మరికొందరు ఎన్నికయ్యారు.

కడ్తాల్ ఎంపీడీఓగా సుజాత



కడ్తాల్: కడ్తాల్ మండల ఎంపీడీఓగా సుజాత బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు కడ్తాల్ ఎంపీడీఓగా పనిచేసిన రామకృష్ణ వికారాబాద్ జిల్లాకు బదిలీ కాగా సంగారెడ్డి జిల్లా కోహిర్ ఎంపీడీఓగా పనిచేస్తున్న సుజాత బదిలీపై కడ్తాల్‌కు వచ్చారు. సుజాత మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. సుజాతకు కార్యాలయ సిబ్బంది, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌గా సునీత

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం తహసీల్దార్ అన్వర్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బుధవారం హయత్‌నగర్ తహసీల్దార్ సునీత ఇక్కడ పదవీ బాధ్యతలు చేపట్టారు. కాగా అసెంబ్లీ ఎన్నికల ముందు నవంబర్ నెలలో అన్వర్ బదలీపై ఇక్కడికి వచ్చారు. ఇంత తొందరగా బదిలీ వేటు పడుతుందని భావించలేదు. ఆయన షాబాద్ తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు.

తుర్కయంజాల్ కమిషనర్‌గా వాణి

తుర్కయంజాల్: తుర్కయంజాల్ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా వాణిని నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. తుర్కయంజాల్ కమిషనర్‌గా పనిచేస్తున్న సీహెచ్.శ్రీకాంత్‌ను పెద్దపల్లి జిల్లా రామగుండం మున్సిపాలిటీకి కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆయన గడిచిన 7 నెలలుగా ఇక్కడ పనిచేస్తున్నారు.

సీఏపీఎఫ్ వెల్ఫేర్ బోర్డును స్థాపించాలి



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ సైనికుల కుటుంబ సభ్యులు, స్థానికులు

హుడాకాంప్లెక్స్: సీఏపీఎఫ్ వెల్ఫేర్ బోర్డును స్థాపించి అమర జవాన్ల కుటుంబాల సంక్షేమం కోసం కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తెలంగాణ మాజీ కేంద్ర సాయుధ పోలీస్ ఫోర్స్ సిబ్బంది సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి కోరారు. పుల్వామా ఉగ్రదాడిలో వీరమరణం పొందిన జవాన్లకు బుధవారం సాయంత్రం నివాళులర్పించారు. అనంతరం సరూర్‌నగర్ స్టేడియం నుండి కొత్తపేట చౌరస్తా వరకు కొవొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో 15 వేల సర్వీస్ సిబ్బంది ఉన్నారని తెలిపారు. రాష్ట్రాల వారీగా బోర్డులను ఏర్పాటు చేసి సైనికుల కుటుంబాలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. 2012లో కేంద్ర ప్రభుత్వం ఆదేశించినా తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని సీఏపీఎఫ్ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసి సైనికులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు రామకృష్ణ, ఎస్.ఎన్.రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తలకొండపల్లి: సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, వాటర్ ట్యాంక్‌లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని దేవునిపడకల్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు జోగు రమేశ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కసిరెడ్డి తన ఎమ్మెల్యే నిధుల నుంచి సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూర్ చేశారని చెప్పారు. మాజీ సర్పంచ్ శ్రీశైలం, ఎంపీటీసీ రమేష్, నాయకులు.. జగ్గారెడ్డి, భిక్షపతి, శంకర్, రమేష్, నవీన్, పాండు, కృష్ణయ్య, శ్రీను, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

మోదీతోనే దేశ అభివృద్ధి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న రవీందర్ తదితరులు

బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్

యాచారం: ప్రధాని నరేంద్రమోదీతోనే దేశ భద్రత, అభివృద్ధి సాధ్యమని బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్ పేర్కొన్నారు. 'గావ్ చలో అభియాన్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాత్రి కుర్మిద్ద గ్రామంలో బూత్ స్థాయి కమిటీల సమావేశం ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి మంజూరు చేస్తున్న నిధులు, అభివృద్ధి పనులపై చర్చించారు. మంగళవారం రాత్రి అక్కడే బస చేసి బుధవారం ఉదయం గ్రామంలోని పలు కాలనీల్లో పర్యటించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటువేసి మూడోసారి నరేంద్రమోదీని ప్రధానమంత్రిని చేయాలని కోరారు. అనంతరం ఇంటింటికీ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధికార ప్రతినిధి మల్లేశ్, బూత్ అధ్యక్షుడు ప్రవీణ్, శ్రీనువాస్‌గౌడ్, నాయకులు వెంకటేశ్, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.